సాక్షి
జోగుళాంబ గద్వాల

శనివారం । 9 । నవంబర్ । 2024



సమస్యల స్వాగతం
జోగుళాంబ ఆలయంలో తిష్టవేసిన సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

వివరాలు 8లో ▸



పాలమూరు శుభారంభం..
రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య పాలమూరు జట్లు శుభారంభం చేశాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.5/19.7

ఉదయం నుంచి ఎండ ప్రభావం ఉంటుంది. అడపాదడపా ఆకాశం మేఘావృతమవుతుంది. చిరుజల్లులు కురవవచ్చు.



కురుమూర్తిస్వామివారు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న స్వామివారి ముఖద్వారం



నైవేద్యం వండుతున్న భక్తులు



ఊకచెట్టువాగులో ఉద్దాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

అఖిలాండ నాయకుడికి.. అడుగడుగున దండాలు

ఉద్దాలోత్సవానికి పోటెత్తిన భక్తజనం

- పాదులకు వడ్డేమాన్‌లో ప్రత్యేక పూజలు
- ఊకచెట్టువాగులో తిరునాళ్లను తలపించిన వేడుకలు
- తమ ఇంటి ఇలవేల్పు సన్నిధికి చేరుకున్న మట్టిబిడ్డలు
- జనసంద్రమైన కురుమతి కొండలు

చిన్నచింతకుంట: అమ్మాపురంలో కొలువుదీరిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన శ్రీకురుమూర్తిస్వామి ఉద్దాలోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉద్దాల ఊరేగింపు కార్యక్రమం వేలాది మంది భక్తుల నడుమ కొనసాగగా.. గోవింద నామస్మరణతో కురుమూర్తికొండలు పులకించిపోయాయి. అంతకు ముందు పల్లమర్రిలో నియమనిష్టలతో తయారు చేసిన చాటకు దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక పూజలు చేసి.. ప్రత్యేక ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకువచ్చారు. దారిపొడవునా లాల్‌కోట, నెల్లికొండి గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు. అనంతరం వడ్డేమాన్‌లోని ఉద్దాల మండపానికి చేరుకున్న చాటకు మండపం ఎదుట దళిత పూజారులు ప్రత్యేక పూజలు చేసి.. అందులో పాదుకలు ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డితో పాటు పాలక మండలి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు జరిపారు. పోలీసు బందోబస్తు మధ్య మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ ఉద్దాలను ఊకచెట్టు వాగుకు తరలించారు. దళిత పూజారులు ఉద్దాలను చేతులపై పట్టుకొని వస్తుండగా వాటిని దర్శించుకొనేందుకు దారి పొడవునా భక్తులు పోటీపడ్డారు. **దాదాపు రెండు గంటలపాటు సాగిన వేడుకకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పాదు**కలు కాలిబాటన తిరుమలాపురం చేరుకోగా.. ఆంజనేయస్వామి గుడి వద్ద గ్రామస్తులు స్వాగతం పలికి.. అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉద్దాలను కురుమూర్తికి తరలించారు. ఉద్దాల గుండుకు పాదుకలు చేరగానే ఆ ప్రాంతమంతా ఏడుకొండల వాసుడి నామస్మరణతో మార్మోగింది. శివసత్తుల పూనకాల మధ్యన పూజలు నిర్వహించి జాతర మైదానానికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. జాతర మైదానంలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేసిన తర్వాత ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఈఓ పూజలు చేసి.. స్వామివారి చెంతకు చేర్చారు. ఆలయంలో పూజలు చేసిన తదుపరి ఉద్దాల మండపానికి తరలించారు. ఏడాది పొడవునా మండపంలో ఈ పాదుకలు పూజలందుకోనున్నాయి.

3 లక్షల మంది హాజరు..

ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, ఎడ్ల బండ్లపై భక్తులు జాతరకు చేరుకున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, అచ్చంపేట, వనపర్తి, గద్వాల తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపిస్తోంది. దేవరకద్ర, మక్తల్, అమరచింత, కొత్తకోట, చిన్నచింతకుంట ప్రాంతాల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో భక్తులు తరలివచ్చారు.



ఎద్దుల బండ్లపై జాతరకు తరలివస్తూ..





కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



జాతర మైదానానికి చేరుకున్న ఉద్దాలు



శివసత్తువుల పూనకాలు

ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయాలి



రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: ఎర్రవల్లి ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేసేలా చూడాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల రవి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి శ్యాంసుందర్, మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల రాములు కలిశారు. ఎర్రవల్లి ఇండోర్ స్టేడియం పనులు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 2.5 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్టేడియాన్ని పట్టించుకోలేదని, తాజాగా ఆ పనులు పరిశీలించి పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇండోర్ స్టేడియం సందర్శించి పనులు చేపడతామని చైర్మన్ భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

నవోదయకు గడువు పెంపు

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి మరోసారి గడువు పెంచినట్లు ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 9 వరకు ఉన్న గడువును ఈ నెల 19 వరకు పెంచారన్నారు. ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్న ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అర్హులైన విద్యార్థులు 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,411

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 2,972 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. క్వింటాల్ గరిష్టంగా రూ.2,411, కనిష్టంగా రూ.1,877 ధరలు లభించాయి. అదేవిధంగా ధాన్యం హంస రకం గరిష్టంగా రూ.2,159, కనిష్టంగా రూ.2,014, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,639, కనిష్టంగా రూ.1,516, సోనమసూరి రూ.1,764, శ్రీరాంగోల్డ్ గరిష్టంగా రూ.2,619, కనిష్టంగా రూ.2,596 ధరలు పలికాయి.

న్యూస్‌రీల్

సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలి



గద్వాల: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని, 100మంది సభ్యత్వం నమోదు చేయించిన వారికి ఈనెల 15న సాయంత్రం 4గంటలకు జిల్లా బీజేపీ కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా సన్మానించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీలోపు సభ్యత్వాలను పూర్తి చేయాలన్నారు. లక్ష్యం మేరకు సభ్యత్వాలను పూర్తి క్రియాశీల కార్యకర్తలకు భవిష్యత్తులో పార్టీలో ఉన్నత పదవులు పొందే ఆవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు బలిగేర శివారెడ్డి, కిష్టన్న, దేవాదాస్, శ్యామ్, వీరేష్ తదితరులు ఉన్నారు.

రెండు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్



ఉండవెల్లి: మండలంలోని ఉండవెల్లి శివారులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం శని, ఆదివారం బంద్ ఉంటుందని మార్కెట్ యార్డు కార్యదర్శి యల్లస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, శుక్రవారం కేంద్రంలో మొత్తం 2135 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా చేపట్టాలి



సర్వే బృందానికి సూచనలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: జిల్లాలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాలకు సంబంధించి సమగ్ర సర్వే పక్కాగా చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ సర్వే బృందాన్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన గద్వాల మున్సిపాలిటీలో చేపడుతున్న ఇంటింటి లిస్టింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి లిస్టింగ్ ప్రక్రియను 8వ తేదీ శుక్రవారం నాటికి పూర్తి చేయాలన్నారు. లిస్టింగ్ చేసిన ఇళ్లకు స్టిక్కర్లు వేశారా అని బృందాన్ని అడిగి తెలుసుకు న్నారు. ఇంకా మిగిలిపోయిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి స్టిక్కర్లు వేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మల్లి ఖార్జున్, ఎల్లారెడ్డి, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు

బాలల హక్కుల పరిరక్షణలో అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో బాలల పరిరక్షణ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మొదట సంతకం చేసి బాలలకు చదువుకునేందుకు స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పించడం సామాజిక బాధ్యత అన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరు బాలల హక్కుల పరిరక్షణకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, జెడ్పీ సీఈవో కాంతమ్మ, జిల్లా సంక్షేమశాఖ అధికారి సుధారాణి, కార్మికశాఖ అధికారి మహేష్, రమేష్‌బాబు, సరోజ, ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, ఆనంద్, నర్సింహా, హేమలత, సుజాత పాల్గొన్నారు.

బాలిక మృతికి కారకుడిని అరెస్టు చేయాల్సిందే..



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకులు

గద్వాల అర్బన్: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేసే వరకు పోరాటం చేస్తామని అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకులు స్పష్టం చేశారు. బండ్ల రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి బిజ్వారానికి చెందిన మైనర్ బాలికపై దొంగతనం నెపం మోపగా.. పోలీసులు అత్యుత్సాహం చూపుతూ బాలికను విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేయడంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ విషయంపై కేసు నమోదై 20 రోజులవుతున్నా అతడిని అరెస్టు చేయకపోవడం ముమ్మాటికీ పోలీసుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. పోలీసులు ఇలాంటి వైఖరిని కొనసాగిస్తే ఎస్పీ, డీఎస్పీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. పోలీసు క్లూస్ టీంలకు ఇప్పటి వరకు నిందితుల గురించి ఎలాంటి సమాచారం దొరకట్లేదని చెప్పడం నమ్మశక్యంగా లేదని, ఇది పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. బాలిక మృతి కారకుడిని అరెస్టు చేయాలని శాంతియుతంగా చేపట్టే ధర్నాకు పోలీసులు పర్మిషన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. బండ్ల రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు, మల్దకల్ ఎస్ఐని సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై మానవ హక్కుల కమిషన్‌తో పాటు డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జ్యోతి, వాల్మీకి, ఆంజనేయులు, వెంకటస్వామి, సుభాన్, ప్రభాకర్, కుర్వ పల్లయ్య, మక్బూల్, నర్సింహ్మా, రేవతి పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో దోపిడీ

- ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో అధికంగా సెమిస్టర్ పరీక్ష ఫీజులు
- ల్యాబ్, లైబరీ, డెవలప్‌మెంట్ ఫీజుల పేరిట వసూళ్లు
- జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ కళాశాలకు నోటీసులు



గద్వాల అర్బన్: విద్యను వ్యాపారంగా చేసి జేబులు నింపుకునే దందాకు తెరలేపారు కొందరు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు. పీయూ నిర్ణయించిన ఫీజుల కంటే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి సెమిస్టర్ ఎగ్జామ్‌కు అధిక ఫీజులు వసూలు చేయగా.. గత బుధవారం విద్యార్థి సంఘాలు పీయూ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో పీయూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాసులు సదరు డిగ్రీ, పీజీ కళాశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఇదే పంథాలో తమను అడిగేవాళ్లు లేరంటూ జిల్లాలోని కొన్ని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల నుంచి ఫీజుల పేరిట అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలు అడ్మిషన్ల క్యాంపెయిన్ క్రమంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆఫర్లు ప్రకటిస్తూ..ఎగ్జామ్ ఫీజు మినహా ఎలాంటి ఫీజు చెల్లించాల్సినవరసం లేదని, అన్ని కళాశాలల కంటే మా కళాశాలలోనే తక్కువ ఫీజు ఉందంటూ నమ్మబలికించేలా చెబుతారు. తీరా విద్యార్థి కళాశాలలో చేరిన తర్వాత ఆసలు కథ మొదలవుతుంది. ఇదీ జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల తీరు. ఉన్నత విద్యామండలి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఉన్న సౌకర్యాలను బట్టి కోర్సుల వారీగా ఫీజులను నిర్ణయించింది. అయితే జిల్లాలోని కొన్ని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు నిబంధనలను సైతం తుంగలో తొక్కుతూ ఇష్టానుసరంగా ఫీజులను వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఒక్కో విద్యార్థికి పీజీ, బీఈడీకి రూ.5వేలు డెవలప్‌మెంట్ ఫీజు, ల్యాబ్, లైబరీ, రూ.250 ఐడీకార్డులు, రికార్డుల, టీసీ ఇచ్చే క్రమంలో రూ.500 తదితర ఫీజులను వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అదేవిధంగా డిగ్రీ విద్యార్థులకు కోర్సుల వారీగా ల్యాబ్, లైబరీ పేరిట రూ.1000 వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులు చెల్లిస్తేనే సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులను కట్టించుకుంటామని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇక చెల్లించిన ఫీజులకు సైతం ఎలాంటి రశీదు ఇవ్వట్లేదని సమాచారం. దీనిని అడిగిన విద్యార్థులను ప్రాక్టికల్స్‌లో మార్కులు, అటెండెంట్స్ విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కళాశాలకు షోకాజ్ నోటీసు

జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులను అదనంగా వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీ ఎదుట ఇటీవల ధర్నా చేశారు. కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని వైస్ ఛాన్స్‌లర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎం డిగ్రీ కళాశాలకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయం బయటకు పొక్కకుండా సదరు కాలేజీ యాజమాన్యం విద్యార్థులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తుందని సమాచారం. విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులను తిరిగి చెల్లించాలని పీయూ అధికారులు ఆదేశించగా.. సదరు యాజమాన్యం మాత్రం విద్యార్థులకు చెల్లించకుండా రశీదులు రాసి ఇచ్చి, ఈ రుసుమును కాలేజీ ఫీజులో కలుపుతామని చెప్పినట్లు సమాచారం.

ఇష్టానుసారంగా ఫీజులు

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలల్లో వివిధ కోర్సుల వారీగా రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్‌కు సంబంధించి పీయూ యూనివర్సిటీ నిర్ణయించి ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. రెగ్యూలర్ ఎగ్జామ్ సెమిస్టర్ ఫీజు కంటే అదనంగా సుమారుగా రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఇక బ్యాక్‌లాగ్ రెండు సబ్జెక్టులకు ఒక ఫీజు, రెండుకు పైగా ఉంటే మరో ఫీజు, అంత కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే ఇంకో ఫీజు ఉంటుంది. యూనివర్సిటి జారీ చేసిన ఎగ్జామ్ ఫీజు నోటిఫికేషన్‌ను కళాశాలల్లోని నోటీసు బోర్డులో అతికించడంలేదు. అలాగే, డిగ్రీ, పీజీ పూర్తయినా విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)ఇచ్చే క్రమంలో ఒక్క విద్యార్థి నుంచి రూ.500, సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజుల కంటే ఒక్కో విద్యార్థి నుంచి అదనంగా రూ.400వరకు వసూలు చేస్తున్నారు.కళాశాలల్లో సరైన వసతులు.. సబ్జెక్ట్ అధ్యాపకులు.. సరిపడా సిబ్బంది లేకున్నా కూడా ఫీజులు మాత్రం అధికంగా వసూలు చేస్తున్నా చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు



జిల్లాలోని కొన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు పీయూ నిర్ణయించిన వాటికంటే అదనంగా పరీక్ష ఫీజుపై రూ.1500 వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు.

– హలీమ్ పాషా, పీడీఎస్‌యూ, జిల్లా అధ్యక్షుడు

చర్యలు తప్పవు

ఎవరైనా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా వస్తే అట్టి కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. సెమిస్టర్ ఎగ్జామ్‌కు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని గద్వాలలోని ఎస్‌వీఎం డిగ్రీ, పీజీ కళాశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వాలని ఆదేశించాం.అదనంగా వసూలు చేసిన ఫీజులను రీఫండ్ చేయాలని సూచించాం.

– శ్రీనివాసులు, పీయూ, వైస్ ఛాన్స్‌లర్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ శివారు సత్యసాయి పంప్‌హౌజ్ దగ్గర శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో తల, శరీర భాగాలు చెల్లాచెదురయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ సురేంద్రబాబు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

మూర్ఛ వ్యాధితో యువకుడు మృతి


బోయ చిన్న నర్సింహులు (ఫైల్)

ధరూరు: స్నానానికి వెళ్లిన ఓ యువకుడు బాత్‌రూంలోనే పడి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ చిన్న నర్సింహులు (30) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూంలోకి వెళ్లాడు. అదే సమయంలో మూర్ఛ రావడంతో తల బకెట్‌లో పడి మృతిచెందాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో భార్య చుట్టుపక్కల వారిని పిలిచి బాత్‌రూం తలుపు విరగొట్టగా అప్పటికే విగత జీవిగా కనిపించాడు.

చికిత్స పొందుతూ యువకుడు..


బోయ కృష్ణ (ఫైల్)

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డికి చెందిన ఓ యువకుడు కర్నూల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ కృష్ణ(26) కూలీ పనులు చేసుకొని జీవించేవాడు. తల్లిదండ్రులు నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందడంతో అప్పటి నుంచి ఒంటరి తనాన్ని భరించలేక మద్యానికి బానిసయ్యాడు. గురువారం తన వ్యవసాయ పొలంలో పురుగుమందు తాగి చనిపోతున్నానని పెద్దనాన్న కుమారుడు అర్జున్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఆయన వెంటనే అక్కడకు చేరుకుని చికిత్స నిమిత్తం అయిజలోని ఓ ఆస్పత్రికి ఆసుపత్రికి, అటు నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బావిలో పడి యువతి..

అచ్చంపేట రూరల్: ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి ఓ యువతి మృతి చెందిన సంఘటన శుక్రవారం అచ్చంపేట మండల పరిధిలోని ఐనోల్‌లో చోటు చేసుకుంది. సిద్దాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ... ఐనోల్‌కు చెందిన నేనావత్ దర్యకు నలుగురు కుమార్తెలు. రెండో కుమార్తె నేనావత్ సకిత(19) ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసింది. ఈ ఏడాది ఇంటి వద్దనే ఉంటూ మేకలను కాస్తుంది. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న మేకలను వ్యవసాయం పొలం వద్ద మేపడానికి తీసుకెళ్లింది. ఓ వ్యవసాయ బావి వద్ద ప్రమాదవశాత్తు జారి బావిలో పడింది. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయింది. సమీప రైతులు గమనించి బావిలో నుంచి సకితను బయటకు తీసేసరికే మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాక్సో కేసులో ఒకరి రిమాండ్

గద్వాల క్రైం: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లికి చెందిన ఆంజనేయులును అదుపులోకి తీసుకొని గురువారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆంజనేయులు రెండ్రోజుల కిందట గద్వాల మండలంలోని ఓ ప్రభుత్వ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ ఉద్యోగానికి వెళ్లారు. ప్రస్తుతం ఖాళీలు లేవని ప్రిన్సిపల్ చెప్పి బయటకు వెళ్లాల్సిందిగా సూచించారు. బయటకు వస్తున్న క్రమంలో ఓ బాలికతో మాట కలిపి పట్టుకునే ప్రయత్నం చేయగా సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆంజనేయులుపై పోక్సో కేసు నమోదు చేసి గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

తెలకపల్లి: పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని బొప్పల్లి గ్రామానికి చెందిన సామ నవీన్(23) అక్టోబర్ 17న మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ మృతదేహాన్ని మరుసటి రోజు శ్మశాన వాటికలో పూడ్చిపెట్టారు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి మున్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. శుక్రవారం తెలకపల్లి తహసీల్దార్ జాకీర్ అలీ, నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రి వైద్యులు హనుమంతురావు, దశరథం సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేసినట్లు తెలిపారు.

సమస్యల స్వాగతం!


అలంపూర్ ఆలయాల సముదాయం

- నేడు జోగుళాంబ ఆలయ పాలకమండలి తొలి సమావేశం
- ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా
- అభివృద్ధికి అడ్డొస్తున్న నిబంధనలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయ పాలకమండలి తొలి సమావేశం శనివారం జరగనుంది. 40 రోజుల కిందట ప్రమాణ స్వీకారం చేసిన పాలకమండలి సభ్యులు నేడు జరిగే సాధారణ సర్వసభ్య సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో సిబ్బంది, సభ్యుల పరిచయ కార్యక్రమాలు ఉంటాయని ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. తొలి సమావేశం పరిచయాలకే పరిమితమవుతుందా ? లేక పేరుకు పోయిన సమస్యలపై ఆరా తీస్తారా ? పని తీరు ఎలా ఉంటుందో సర్వత్రా ఆసక్తికర అంశం.

ఇదీ పరిస్థితి..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలకు ఏటా రూ.9 కోట్ల ఖర్చు ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇక రూ.5 కోట్ల అసెస్‌మెంట్ (నికర) ఆదాయం ఉన్నట్టు తెలుస్తోంది. ఆలయాలకు 400 ఎకరాల భూములు ఉండగా.. వీటి ద్వారా రూ.28 లక్షల నుంచి రూ.30 లక్షల దాకా ఆదాయం వస్తుంది. ఏడాదికి నాలుగు సార్లు లెక్కించే హుండీల ద్వారా సుమారు రూ.2.50 కోట్లు, వాహన పార్కింగ్, టెంకాయలు, పూజా సామగ్రి, శౌచాలయాల నిర్వహణ, బుక్‌స్టాల్, కొబ్బరి చిప్పల సేకరణ, చీరల వేలం, వసతి గదుల టెండర్ల ద్వారా రూ.1.70 కోట్ల ఆదాయం సమకూరుతుంది (ఈ ఏడాది రూ.3 కోట్లు దాటింది). ఇక తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ఈ ఆలయాలకు మంచి గుర్తింపు ఉంది. అందుకే వివిధ రాష్ట్రాల ప్రముఖులు కూడా ఆలయాలకు వస్తుంటారు. ఇంత ఆదాయం ఉన్నా కనీస సౌకర్యాలు సమకూర్చడం లేదు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధనలు అభివృద్ధికి అడ్డుగా ఉన్నాయంటారు. నేటి వరకు ఏ ఒక్క పాలకమండలి కూడా ఈ అంశాలపై దృష్టి సారించలేదు. ప్రస్తుత పాలకమండలి ఏం చేస్తుందో చూడాలి.

ఖర్చుల మాటేమిటి..?

ఆలయంలో ఏ ఉత్సవం నిర్వహించినా.. ఆదాయ వివరాలు చెబుతున్న ఆలయ అధికారులు ఎంత ఖర్చు చేస్తున్నారనే వివరాలను రహస్యంగా ఉంచుతున్నారు. అలాగే ఏటా ఆలయ నిర్వహణకు ఎంత వెచ్చిస్తున్నారనే అంశాన్ని దాచుతున్నారు. పాలకమండలికి కూడా ఏడాది కాలపరిమితి ఉండటంతో ఆలయంలో ఏం జరుగుతుందో నేటి వరకు ఏ పాలకమండలి దృష్టి సారించలేకపోతోంది.

ముందుగా సమస్యలు గుర్తిస్తాం..



ఆలయాల్లోని సమస్యలను ముందుగా గుర్తిస్తేనే పరిష్కారం సులభతరమవుతుంది. ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటాం.
– జోగుల సరస్వతి, పాలకమండలి సభ్యురాలు

పర్యవేక్షణ కొరవడింది..



రాష్ట్రంలో ఉన్న ఏకైక శక్తిపీఠం. ఆలయాలు అభివృద్ధి చెందాలంటే నిధులు అవసరం. అలాగే పాలనాపరమైన సిబ్బంది కావాలి. ఇందుకు రాష్ట్ర దేవాదాయశాఖ అనుమతులు కావాలి. ఇక్కడి పరిస్థితులపై ఆ శాఖ అధికారుల పర్యవేక్షణ జరగడం లేదని తెలిసింది. కమిషనర్‌ను ఆలయానికి తీసుకొస్తాం.. రివ్యూ మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తాం.
– నాగరోమణి, పాలకమండలి సభ్యురాలు

సమస్యల తోరణం..

సాధారణ భక్తుడి సందేహాల నివృత్తికి సమాచార కేంద్రం లేదు. ఆలయంలో అన్నదాన సత్రం ఉన్నా వాటిపై ప్రచారం లేదు. జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు మినహా యోగా నారసింహ స్వామి, వేంకటేశ్వర, సూర్యనారాయణ, కామాక్షి ఆలయాల్లో అధికారులు, పాలకమండలి సభ్యులు అడుగు పెట్టడం లేదు. దీంతో ఆయా ఆలయలకు ఆదరణ కరువైంది. పాలకమండలికి ఈ ఆలయాలు ఉన్నట్లు కూడా తెలియదు. ఆదాయం లేని ఆలయాలను అభివృద్ధి చేసి చూపించాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయాల ఆదాయానికి గండి..!

ఆలయానికి రోజు వీఐపీలు, రెకమెండేషన్ల పేరిట ఉచిత దర్శనాలు, అభిషేకాలు, అర్చనలు అధికమయ్యాయి. పాపనాశని ఆలయం వద్ద పితృదోషాలు, శ్మశాన నారాయణుడు, మరకత లింగం అంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాం చేసుకొని కొందరు అమాయక భక్తుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ఆలయాల్లో పందులు, మేకలు, కుక్కల సంచారం అధికమైంది. 65 మందికి పైగా సిబ్బంది ఉన్నా.. ఎక్కడ ఎవరెవరు ఏం పని చేస్తున్నారో పట్టించుకోవడం లేదు. ఇలాంటి సమస్యలపై కొత్త పాలకమండలి దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు

- పూజల్లో పాల్గొన్న సీఎం కుటుంబ సభ్యులు
- హాజరైన కలెక్టర్, ఎస్పీ

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఆయన సొంత నిధులతో నిర్మించిన ఆలయంలో శుక్రవారం భాజాభజంత్రీలు, పురోహితుల వేదమంత్రాల మధ్య అభయాంజనేయస్వామి, కాశీ విశ్వేశ్వరస్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తెల్లవారుజామునే దేవతారాధన పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల తర్వాత యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం, విగ్రహాల స్థాపన, అభిషేకం, గోదర్శనం, పూర్ణాహుతి మహోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి భార్య గీత, కూతురు, అల్లుడుతోపాటు ఆయన సోదరులు కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను తిలకించి నూతనంగా ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి, శివుడిని దర్శించుకోవాలన్న సంకల్పంతో కొండారెడ్డిపల్లి గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. 10 గంటల ప్రాంతంలో మొదట దీపారాధన స్తంభం తర్వాత ధ్వజస్తంభ ఆరోహణ చేశారు. శ్రీరామ నామస్మరణతో కొండారెడ్డిపల్లి పులకించిపోయింది.


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

అభయాంజనేయస్వామి, కాశీ విశ్వేశ్వరస్వాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పాల్గొన్నారు. వీరికి వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నిధులతో అద్భుతంగా నిర్మించిన ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు కేవీఎస్ రెడ్డి, గ్రామస్తులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లాలుయాదవ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

12న బీసీల సదస్సు

బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 12వ తేదీన బీసీల సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎస్‌జీవో భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలు బీసీ కుల సంఘాల పెద్దలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సదస్సులో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు, శాంలక్ష్మీ ఐఏఎస్ అకాడమి ఫౌండర్ రవికుమార్ ప్రజాప్రతి, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు పాల్గొంటారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల పాత్ర అనే అంశంపై, ఈడబ్ల్యూఎస్, జీవో నంబర్ 29 గురించి చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, సగర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ శేఖర్, దుర్గేష్, కోమల్ కుమార్, నర్సింలు, మల్లేష్, పాండు, బాలచందర్, నర్సప్ప, నాగప్ప, ఆంజనేయులు, రవికుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌సాగర్

విలువలతో కూడిన విద్య బోధించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

నాగర్‌కర్నూల్: మానవ విలువలతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తానన్నారు. శుక్రవారం మండలంలోని కుమ్మెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు తిప్ప రామ్మూర్తి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి సీఎస్‌ఆర్ మాదిరిగానే ఏఎస్‌ఆర్ కూడా అవసరమన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో పాఠశాలల అభివృద్ధికి నిధులు ఎంత అవసరమో.. ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అందించేందుకు బాధ్యత వహించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రాథమిక స్థాయి విద్యతోపాటు విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో, మెరుగైన విద్యా విధానం అందించాలని ఉద్దేశంతో పనిచేస్తున్నారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలల్లోని చదువుకొని ఈ స్థాయికి వచ్చానని, ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువరైతు దారుణ హత్య


ఘటనా స్థలంలో డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు


రాజు (ఫైల్)

వెల్దండ: వేరుశనగ పంటకు రక్షణగా వెళ్లిన రాత్రివేళలో వ్యవసాయం పొలానికి వెళ్లిన యువరైతు రాత్లావత్ రాజు(30) దారుణ హత్యకు గురయ్యాడు. మండలంలోని మహాత్మగాంధీతండాలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రాజు తండా సమీపంలోని సొంత పొలం మూడెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. గురువారం రాత్రి భోజనం అనంతరం భార్య హిమబిందుతో కలిసి అడవి పందుల నుంచి వేరుశనగ పంట కాపాడుకోవడానికి వ్యవసాయ పొలానికి వెళ్లి మంచంపై పడుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో భర్త రాజు కనిపించడం లేదని పక్క పొలంలో ఉన్న రాజు అన్నకు హిమబిందు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. దీంతో అందరూ కలిసి చుట్టుపక్కల వెతకగా.. కాలినకడన వెళ్లే దారిలో రక్తపు మడుగులో మృతిచెంది కనిపించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో తలపై నరికి చంపినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు, డయల్ 100కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి సిబ్బందితో వచ్చి పరిశీలించారు. చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. నాగర్‌కర్నూల్ నుంచి జాగిలాలను రప్పించగా.. హత్య చేసిన ప్రదేశం నుంచి డాగ్‌స్క్వాడ్ తండా వైపు వెళ్లింది. క్లూస్‌టీం బృందం అక్కడ రక్త నమూనాలతో మరికొన్ని ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజుకు భార్యతోపాటు కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. రాజు తండ్రి వస్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిన్నంటిన రోదనలు..

రాజు హత్యకు గురికావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. దాదాపుగా ఎనిమిదేళ్ల క్రితం తండాకు చెందిన బంధువుల అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నారు. తండాలోనే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయితే ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని భార్యతోపాటు బంధువుల రోదనలు మిన్నంటాయి.

తండాలో భయాందోళన

రాజు దారుణ హత్యకు గురికావడంతో తండాలో రైతులు భయాందోళన చెందుతున్నారు. మారుమూల గిరిజనతండాలో జీవనం సాగిస్తున్న రైతును గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేయడంతో కలకలం రేగింది. హత్య చేసిన దుండగులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించి రాజు కుటుంబానికి న్యాయం చేయాలని తండావాసులు పేర్కొన్నారు. హత్యకు సంబంధించి ఎలాంటి వివరాలు తెలియకపోవడం గమనార్హం.

కారుకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు



లింగాల: ఇంటి ముందు నిలిపిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన ఘటన మండలంలోని అప్పాయపల్లి సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. అప్పాయపల్లి నుంచి శ్రీరంగాపూర్ వెళ్లే మార్గంలో నివాసం ఉంటున్న పుట్టా మధుసూదన్‌రెడ్డి తన ఇంటి ఆవరణలో కారును నిలిపి ఉంచారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా పూర్తిగా కాలిపోయింది. కారు విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని యజమాని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మృతదేహంపై ఉన్న బంగారం చోరీ

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కలకలం
- విచారణ చేపట్టిన పోలీసులు

గద్వాల క్రైం: ఆస్పత్రి సిబ్బంది మహిళా మృతదేహంపై ఉన్న బంగారు ఆభరణాలను చోరీ చేసిన ఘటన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం వెలుగు చూసింది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. గోనుపాడుకు చెందిన శేషమ్మ (31) గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆమె ఒంటిపై రెండు తాళి బొట్లు, ముక్కుపుడక, రెండు అర్తి గుండ్లు ఉన్నట్లు పోలీసులు తమ పంచనామాలో పొందుపర్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపర్చారు. శుక్రవారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తున్న క్రమంలో మృతదేహంపై బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులు, కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులు ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్‌కు వివరించగా.. గురు, శుక్రవారం విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు సేకరించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.

మిర్చి పంటకు పైముడత


పైముడత తెగుళ్లు ఆశించిన మిరప పైరు


ముడత తెగులుతో ముడుచుకున్న పైరు

నివారణ చేపట్టకపోతే.. దిగుబడిపై ప్రభావం

అలంపూర్: ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న మిరప పంటకు ముడత తెగుళు సోకుతోంది. దీనికి సకాలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు సూచించారు. జిల్లాలో మిర్చి పంట విస్తారంగా సాగులో ఉంది. దీంతో పాటు హైబ్రిడ్ మిరపను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో మిరప సాగు రెండు నెలలు దాటింది. ముందుగా వేసిన మిరపకు పైముడత కింది ముడత తెగుళు ఆశిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ రైతులకు సూచించారు. వాటి నివారణ చర్యలను వివరించారు.

తెల్లనల్లి (కింది ముడత):

తెల్లనల్లి పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు కిందికి ముడ్చుకుంటాయి. దీంతో ఆకులు తిరగబడి పడవ ఆకారంలో కనబతాయి. ఆకుల కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారి మొక్కల పెరుగుదల ఆగిపోయి లేత ఆకులు ముద్దకడతాయి.

నివారణ: నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా డైకోఫాల్ 5.0 మి.లీ. లేదా పెగాసెస్‌ను 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతిని బట్టి ఎకరాకు ఫానలోన్ 400 మి.లీ. లేదా ఇంట్రిపిడ్ 400 మి.లీ. పిచికారీ చేసుకోవాలి.

తామర పురుగు(పైముడత): ఇవి ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులు పైకి ముడ్చుకుంటాయి. ఆకులు, పిందెలు, రాగి రంగులోకి మారి పూత పిందె నిలిచిపోతుంది.

నివారణ: పై ముడత నివారణకు 10 లీటర్ల నీటికి 12.5 గ్రాముల డైపెన్ థయురాన్ లేదా 20 మి.లీ. ఫ్రిపోనిల్ లేదా 30 మి.లీ. స్పైనోసాడ్ లేదా 20 మి.లీ. పానలోన్, 15 గ్రాముల ఎసిఫెట్ కలిపి ఆకుల అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి.


పోలీసుల అదుపులో నిందితుడు?

గద్వాల క్రైం: యువతను ఉద్యోగాల పేరుతో మోసం చేసిన నిందితుడిని గద్వాల పోలీసులు శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నటుల్ తెలిసింది. గద్వాల జిల్లా ఆరోగ్య శాఖలో సూపర్‌వైజర్ పోస్టులు ఉన్నాయని గద్వాల మండలం వెంకంపేట గ్రామానికి చెందిన యువరాజు ఆరు నెలల క్రితం నిరుదోగ్యులను నమ్మించి రూ.3 లక్షల చొప్పున వసూలు చేశాడు. అయితే ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత నెల 29న గద్వాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గద్వాల శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు నిఘా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లాలో పలువురు నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో ఆ యువకుడు డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తుంది.

ఇంట్లో పేలిన సిలిండర్

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఓ ఇంట్లో స్టోర్ రూంలో నిల్వ చేసిన సిలిండర్ పేలిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు, ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. పట్టణంలోని హనుమాన్ నగర్‌కాలనీలో రిటైర్డు ఆర్టీసీ కండక్టర్ ఖలీల్ రెహ్మాన్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో గ్యాస్ లీకైన వాసన రావడంతో భయంతో బయటకు వచ్చారు. స్టోర్‌రూంలో నిల్వ ఉంచిన సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఇంట్లో ఉన్న ఫర్నిచర్ పూర్తిగా కాలిపోవడంతోపాటు ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగిందని, కుటుంబ సభ్యులు బయటకు రావడంతో ప్రాణనష్టం జరగలేదని బాధితుడు పేర్కొన్నారు.

తుంగభద్ర నదిలో మహిళ గల్లంతు?


అలంపూర్ వద్ద తుంగభద్ర నదిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

అలంపూర్: తుంగభద్ర నదిలో మహిళ దూకి ఆత్మహత్యకు పాల్పడిందనే సమాచారం స్థానికంగా కలకలం రేపింది. అలంపూర్‌లోని ర్యాలంపాడు బ్రిడ్జిపై నుంచి ఒక మహిళ నదిలోకి దూకినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు బ్రిడ్జి వద్దకు చేరుకొని నదిలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉండవెల్లి మండలం బొంకూరుకు చెందిన గ్రామానికి తన భార్య అని భర్త సమాచారం ఇవ్వడంతో గాలింపు ముమ్మరం చేశారు.ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు.

ఉండవెల్లిలో మిస్సింగ్ కేసు

అలంపూర్‌లో ఓ వివాహిత నదిలోకి దూకిందని అక్కడ గాలింపు చర్యలు చేపడుతుండగా ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో అదే వివాహిత గురించి మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ హహేష్ తెలిపారు. కర్నూలు జిల్లా రేమటకు చెందిన మహిళకు ఉండవెల్లి మండలం బొంకూరుకు చెందిన నాగరాజుతో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీశైలం వెళ్లి వస్తానని ఇంటి పక్కన ఉన్న వాళ్లకు ఇంటి తాళాలు ఇచ్చి వచ్చింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా కలవలేదు. దీంతో వివాహిత అన్న హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండవెల్లి ఎస్‌ఐ తెలిపారు.

డీజీపీని కలిసిన ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: డీజీపీ జితేందర్‌ను శుక్రవారం సాయంత్రం కొందరు ఈడీ అధికారులు కలిసినట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూముల కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఐఏఎస్ అధికారి, రంగారెడ్డిజిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో 3 రోజులపాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే. అంతకుముందు మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి స్టేట్‌మెంట్లను ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ ఇద్దరు అధి కారుల విచారణ సందర్భంగా సేకరించిన సమాచారం ఆధారంగా మాజీ ఆర్డీఓ వెంకటా చారినీ ఈడీ అధికారులు రెండు రోజుల క్రితం సుదీ ర్ఘంగా ప్రశ్నించారు. ఈ కేసులో కీలక సమాచా రం సేకరిస్తున్న నేపథ్యంలో ఈడీ అధికారులు డీజీపీని కలవడం ప్రాధా న్యం సంతరించుకుంది. అమోయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై డీజీపీని కలిసి ఈడీ అధికారులు చర్చించారు. మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు స్థానిక పోలీసుల సహకారం కావాలని డీజీపీని ఈడీ అధికారులు కోరారు. భూదాన్ భూముల వ్యవహారంలో పోలీసులకు లేఖ రాసినా, ఇప్పటి వరకు ఎలాంటి వివరాలివ్వ లేదని డీజీపీకి ఈడీ అధికారులు తెలిపా రు. శంకరాహిల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని కొన్ని భూముల వ్యవహారంలో ఇన్వెస్టిగేషన్ జరిపించాలని డీజీపీని ఈడీ అధికారులు కోరినట్టు సమాచారం.

ఖాకీలపై ఆగ్రహం..

ఈనెల 4 నుంచి సంబంధిత పోలీస్ స్టేషన్లలోని సీసీ ఫుటేజీని స్థానిక మెజిస్ట్రేట్లకు సీల్డ్ కవర్లలో అందజేయండి

సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై ఏపీ హైకోర్టు ఆదేశం

సాక్షి అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కొద్ది రోజులుగా యథేచ్ఛగా జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు, అక్రమ నిర్బంధాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అక్రమ నిర్బంధాల విషయంలో పోలీసుల తీరుపై పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఇద్దరు సోషల్ మీడియా కార్యకర్తల అక్ర మ నిర్బంధానికి సంబంధించి రెండు పోలీస్ స్టేష న్లలో సీసీ టీవీ ఫుటేజీలను సంబంధిత మేజిస్ట్రేట్ల ఎదుట సీల్డ్ కవర్లలో అందచేయాలని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తుల అరెస్ట్ విష యంలో చట్ట నిబంధనలు పాటించి తీరాల్సిందేనని పోలీసులకు తేల్చి చెప్పింది. లేని పక్షంలో తాము జోక్యం చేసుకో వాల్సి ఉంటుందని, ఆ పరిస్థితి తేవద్దని హెచ్చరించింది. ఇది వ్యక్తుల స్వేచ్ఛతో ముడిపడి ఉందని, కాబట్టి ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దని తేల్చి చెప్పింది. చట్ట నిబంధనలు పాటించేలా పోలీసులను చైతన్య పరచాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విశాఖకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త తిరుపతి లోకేష్‌ను సోమవారం తమ ముందు హాజరు పరచాలని పోలీసులను ఆదేశించింది. వ్యక్తులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడం ఎక్కువ అయిందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టును ఆశ్రయించిన బాధిత కుటుంబాలు

టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారంటూ పలువురిని పోలీసులు అక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల్లో 101 మందిని అక్రమంగా అరెస్టులు చేశారు. తమవారిని పోలీసులు కోర్టు ముందు హాజరు పర్చకుండా అక్రమ నిర్బంధంలో ఉంచడంపై బాధిత కుటుంబాలకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా నిర్బంధించిన తమ కుటుంబ సభ్యులను న్యాయస్థానం ఎదుట హాజరు పరిచేలా ఆదేశించాలంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది.

పౌరుల స్వేచ్ఛను కాపాడతాం..

విచారణ సందర్భంగా తిరుపతి లోకేష్ తరఫు న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. వైఎస్సార్ కుటుంబం పేరుతో వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న 411 మందికి నోటీసులు ఇచ్చారని నివేదించారు. వారిలో 120 మంది విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో హాజరయ్యారని తెలిపారు. తిరుపతి లోకేష్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నెల 5న విశాఖ నుంచి విజయవాడ తరలించారన్నారు. లోకేష్ సోదరుడిని పిలిపించి తెల్ల కాగి తాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం లోకేష్ జాడ తెలియడం లేదన్నారు. ఈ సమయంలో కోర్టులో ఉన్న విజయవాడ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జానకి రామయ్యతో ధర్మాసనం నేరుగా మాట్లాడింది. తిరుపతి లోకేష్ సోషల్ మీడియా ద్వారా ఓ గ్రూప్ నిర్వహిస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్నారని ఆయన కోర్టుకు చెప్పారు. దీనిపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. ఫోన్ చేయడంతో తన బావతో కలిసి లోకేష్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారన్నారు. లోకేష్‌ని విచారించిన అనంతరం నోటీసులు ఇచ్చి పంపామన్నారు. నేరానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలతో ఈ నెల 10న హాజరు కావాలని ఆయనకు సూచించినట్లు చెప్పారు. జానకి రామయ్య చెప్పిన వివరాలను రికార్డు చేసిన ధర్మాసనం.. సోమవారం ఉదయం 10:30 గంటలకు లోకేష్‌ను తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. ఈ నెల 4వతేదీ నుంచి 8వ తేదీ వరకు సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సీల్డ్ కవర్‌లో విజయవాడ మెజిస్ట్రేట్‌కు సమర్పించాలని ఆదేశించింది. అరెస్ట్ చేసిన 24 గంటలలోపు నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని స్పష్టం చేసింది. చట్ట నిబంధనలను పాటించి తీరాలని లేదంటే తమ జోక్యం తప్పదని తేల్చిచెప్పింది. పౌరుల స్వేచ్ఛను కాపాడటం ఈ కోర్టు బాధ్యత అని స్పష్టం చేసింది. అంతకు ముందు పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు విని పిస్తూ సోషల్ మీడియా ద్వారా కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం, అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నారని నివేదించారు. ఇలాంటి వారికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొనగా, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ చట్ట నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

టేకులపల్లి స్టేషన్ ఫుటేజీ కూడా..

అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం ఆత్మకూరుకు చెందిన జింకల నాగరాజు అక్రమ నిర్బంధంపై దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. పూర్తి వివరా లతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. టేకులపల్లి స్టేషన్‌లోని సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది.

సోషల్ మీడియా యాక్టివిస్టులకు అండగా నిలుస్తా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య సూత్రాలను, మానవహక్కులను కాలరాసి మరీ సోషల్ మీడియా యాక్టివిస్టులను భయకంపితులను చేస్తున్న, దారుణంగా హింసిస్తున్న అత్యంత క్రూరమైన ప్రభుత్వంతో పోరాడుతున్నామని, ఈ యుద్ధంలో కచ్చితంగా న్యాయమే గెలుస్తుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ఈ అనైతిక యుద్ధంలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై నిత్యం అక్రమ కేసులు, వేధింపులు, నిర్బంధాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమయంలో నిజం పక్షాన నిలబడిన మా ప్రతి సైనికుడికి అండగా నిలుస్తా. కచ్చితంగా న్యాయం గెలుస్తుంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన దుర్యోధన, దుశ్శాసన దుర్నీతి లోకాన్ని తలపిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను కూటమి ప్రభుత్వం అడ్డూ, అదుపు లేకుండా వేధింపులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో బాధితులందరికీ అండగా ఉంటానని వైఎస్ జగన్ ధైర్యం నూరిపోశారు.

మెడికల్ పీజీ సీట్ల బ్లాకింగ్ స్కాంలో ఈడీ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

కరీంనగర్ జిల్లా నగునూర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లిలోని కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీ, సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్ మెడికల్ కాలేజీ, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీ, మేడ్చల్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ, సూరారంలోని మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పటాన్‌చెరులోని మహేశ్వర మెడికల్ కాలేజీ, చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, డెక్కన్ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రాంగణాల్లో ఈడీ సోదాలు జరిపింది. అందులో భాగంగా దర్యాప్తు కొనసాగిస్తున్న అధికారులు.. 12 కాలేజీలతో పాటు మరికొన్ని కాలేజీల యాజమాన్యాలకు కూడా సమన్లు జారీ చేసినట్టు తెలిసింది. అన్ని కాలేజీల ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంటున్నారు. మొత్తం కాలేజీల నుంచి వివరాలు సేకరించిన తర్వాత కేసులో మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లోనే ఉన్నా

▶ మొదటి పేజీ తరువాయి

ఘటనలో మీరు 'ఈస్ట్ ఇండియా కంపెనీ'అంటూ సంబోధించిన సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టగలరా. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల నుంచి ఆంధ్రా కాంట్రాక్టర్‌ను తొలగించే దుమ్ముందా. సీఎం హోదాలో ఒక కాంట్రాక్టు సంస్థకు గులాంగిరి చేస్తున్నావా'అని కేటీఆర్ మండిపడ్డారు.

పుండు ఒక చోట.. మందు మరోచోట

'మూసీ ప్రాజెక్టు బాధితులను పట్టించుకోకుండా మరోచోట సీఎం పాదయాత్ర చేస్తూ పుండు ఒక చోట అయితే మందు మరోచోట అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వేల ఇళ్లను కూల్చివేసేందుకు ప్రణాళికలు వేసి..లక్షలాది మందిని నిరాశ్రయులను చేసే ప్రణాళిక వేసిన సీఎం దొడ్డిదారిన మరోచోట పాదయాత్ర డ్రామా చేస్తున్నారు. లక్షలాది మంది ఆక్రందనలకు కేరాఫ్‌గా మారిన హైదరాబాద్ మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేసే ధైర్యం, చిత్తశుద్ధి సీఎంకు లేదు. దశాబ్దాలపాటు వ్యర్థాలు కలుస్తుంటే అరవై ఏళ్లు కళ్లుండీ చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ వ్యవహరించింది. మూసీ దోపిడీ ప్రాజెక్టు కన్సల్టెంట్లతో మూడురోజుల పాటు చర్చించే సమయం సీఎంకు ఉంది. కానీ ఆరు గ్యారంటీల అమలుపై సమీక్షించేందుకు సమయం లేదా. మోసపూరిత హామీలను పక్కన పెట్టి కమీషన్ల కోసం మూసీ ప్రాజెక్టును నెత్తిన పెట్టుకు న్నారు. పాదయాత్ర చేసినా పొర్లుదండాలు పెట్టినా మూసీ పరీవాహక ప్రాంత ప్రజల వేదన మీకు శాపంగా మారుతుంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నల్లగొండ నేతల అరెస్టు అక్రమం

ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్త లను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనలు చేసిన ప్రతీ సందర్భంలో బీఆర్‌ఎస్ నేతలను ముందస్తు, హౌస్ అరెస్టుల పేరుతో నిర్బంధానికి గురి చేస్తు న్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే మా నేతల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. ఎన్ని నిర్బంధాలకు గురిచేసినా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, హామీల అమలులో వైఫల్యంపై ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటాం 'అని కేటీఆర్ పేర్కొన్నారు.

హ్యాపీ బర్త్ డే సీఎం రేవంత్

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, రాష్ట్ర గవర్నర్ తదితరుల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా భారత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కర్ణాటక, ఏపీ సీఎంలు సిద్ధరామయ్య, ఎన్.చంద్రబాబునాయుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సినీనటుడు చిరంజీవి, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, యూకే కాన్సులేట్ జనరల్ గరెత్ విన్ ఓవెన్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచే కాంగ్రెస్‌నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి క్యూ కట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబులు కలిసి రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్, ప్రియాంకలతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఫొటోను మంత్రి కొండా సురేఖ రేవంత్‌కు బహూకరించారు. గాంధీభవన్‌లో సీఎం రేవంత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ టీచర్లకు గ్రేడింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆ టీచర్‌ను బాధ్యుడిని చేయాలని భావిస్తున్నారు. ఒక టీచర్ చెప్పే సబ్జెక్టులో వరుసగా ఐదేళ్ళ పాటు అతి తక్కువ ఫలితాలు వస్తే కొన్ని చర్యలు తీసుకునే అంశాన్ని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. కాగా గ్రేడింగ్ విధానంపై అన్ని వర్గాలతో చర్చించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు..ఇలా మొత్తం 1,26,518 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 30,178 స్కూళ్ళుంటే, ఇందులో 28,80,809 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

టీచర్లకు గ్రేడింగ్ సరికాదు

రకరకాల పరీక్షల్లో ప్రతిభ చూపిన తర్వాతే ప్రభుత్వ టీచర్‌గా ఎంపిక చేస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత ఆధారంగా ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు. ప్రభుత్వ స్కూళ్ళకు వచ్చే పేద విద్యార్థుల నేపథ్యాన్ని ప్రభుత్వం తెలుసుకోవాలి. స్కూల్‌లో ఉండే సమయంలో తప్ప, ఇంటికెళ్ళితే చదివించే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అంతే తప్ప టీచర్లనే బాధ్యులను చేయడం సరికాదు.

– సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్టీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు)

ముందు మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ స్కూళ్ళలో చాలీ చాలని వసతులున్నాయి. పైగా ఈ స్కూళ్లలో పేద వర్గాల నుంచి వచ్చే విద్యార్థులే అత్యధిక సంఖ్యలో చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాలని ప్రతి టీచర్‌కూ ఉంటుంది. మంచి ఫలితాలు రావాలంటే అందుకు తగిన వాతావరణం, వసతులు కల్పించాలి. మంచి ఫలితాలకు వీలుగా తగిన మార్పులు, చేర్పులు చేయాలి. ప్రైవేటు స్కూళ్ళతో పోటీ పెట్టడం సరికాదు. ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు.

– పింగిలి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



మక్తల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం రాత్రి 9 గంటలకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

చంచల్‌గూడ జైలుకు డీఈఓ

మహబూబ్‌నగర్ క్రైం: ఏసీబీకి పట్టుబడిన మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్‌ను శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 21వరకు రిమాండ్ విధించారు. దీంతో డీఈఓను ఏసీబీ సిబ్బంది చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు రవీందర్‌కు సంబంధించి ఆస్తులు ఎంత మేర ఉన్నాయి, ఇందులో అక్రమంగా సంపద వివరాలు సేకరించే పనిలో ఏసీబీ అధికారులు బిజీగా గడిపారు. కాగా అధికారులు గుర్తించి బ్యాంక్ ఓ లాకర్‌లో 30 నుంచి 40 తులాల బంగారం, విలువైన డాక్యుమెంట్లు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఏసీబీ అధికారుల దాడుల నేపథ్యంలో పాలమూరు డీఈఓ కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా తిష్టవేసిన అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కార్యాలయంలో చాలామందిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



టోర్నీలో పాల్గొన్న వివిధ ఉమ్మడి జిల్లాల జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం రాత్రి అండర్–19 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ టోర్నీలో తెలంగాణలోని ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగం మ్యాచ్‌లను మెయిన్ స్టేడియంలో, బాలికల మ్యాచులను మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారిణి కౌసర్ జహాన్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో ఓటములు, విజయాలు సర్వసాధారణమని,



టోర్నీని ప్రారంభిస్తున్న డీఐఈఓ కౌసర్ జహాన్

ఓటమి తర్వాతనే గెలుపు సాధ్యమని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభచాటే వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. టోర్నీలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాచాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ క్రీడాటోర్నీల నిర్వహణకు పెట్టింది పేరు అని, అందుకే ప్రతి ఏడాది అండర్–19 టోర్నీలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. టోర్నీలో ఓడినవారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నసరుల్లా హైదర్ మాట్లాడుతూ 1990లో ఢిల్లీలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నట్లు గుర్తుచేశారు. టోర్నీలో క్రీడాస్ఫూర్తితో ఆడాలని కోరారు. టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టోర్నీలో ప్రతిభ ఆధారంగానే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. పంజాబ్ రాష్ట్రం పటియాలలో జాతీయస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఉంటుందని తెలిపారు. అనంతరం డీఐఈఓ క్రీడాజట్లను పరిచయం చేసుకొని మహబూబ్‌నగర్–వరంగల్ బాలుర విభాగం ప్రారంభ సన్నాహక మ్యాచ్‌ను ప్రారంభించారు. డీఐఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ సాధిక్, పీడీలు ముక్రం, నాగరాజు, అరుణజ్యోతి, డీఎస్ఏ వాలీబాల్ కోచ్ ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

పాలమూరు శుభారంభం

పాలమూరు బాలబాలికల జట్లు శుభారంభం చేసింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్–రంగారెడ్డి జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. చివరకు జిల్లా బాలికల జట్టు 14–11 గోల్స్ తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. ఇతర బాలికల విభాగం మ్యాచ్‌లో ఖమ్మం జట్టు 29–01 తేడాతో కరీంనగర్ జట్టుపై, బాలుర విభాగం మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 27–19 తేడాతో వరంగల్ జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి. మరోవైపు బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 14–12 గోల్స్ తేడాతో ఖమ్మంపై గెలుపొందింది.



బాలికల విభాగంలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి జట్ల మధ్య మ్యాచ్

నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్ ప్రారంభం



నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్

ధరూరు/దోమలపెంట/రాజోళి : నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక యూనిట్‌ను ప్రారంభించి నీటిని ఎత్తిపోస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు 8,500 క్యూసెక్కులకు తగ్గింది. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఒకే యూనిట్‌లో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 5,126 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 72 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 8,573 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.500 టీఎంసీల నీరు ఉంది.

■ సుంకేసుల డ్యాంకు శుక్రవారం ఎగువ నుంచి 5,565 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటు ద్వారా 3,112 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

■ శ్రీశైలం జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 878.4 అడుగుల వద్ద 179.8995 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకుసుల నుంచి 9,572 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,340 మొత్తం 65,655 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 15,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,505, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో 7.560 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 6.571 మి.యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

హెలీప్యాడ్ కోసం స్థలం పరిశీలన



చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి దర్శనానికి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు. అందుకోసం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎస్పీ డి.జానకి హెలీప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాకకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. వారి వెంట ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బాలోత్సవంతో సృజనాత్మకత పెంపు

స్టేషన్ మహబూబ్‌నగర్: బాలల్లో యాంత్రీకత పెరిగిపోయిందని, ఆటలు, పాటలు లేక సృజనాత్మ ఆలోచనలు రావడం లేదని అందుకే బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు పిల్లలమర్రి బాల్సోతవం కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మహేష్‌బాబు, అధ్యక్షుడు బెక్కం జనార్దన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రతిభ, కార్యనిర్వాహక కార్యదర్శులు వీరాంజనేయులు, ప్రహ్లాదరెడ్డి అన్నారు. జిల్లకేంద్రంలో శుక్రవారం డిసెంబర్‌లో జరిగే 3వ బాలోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు బాలోత్సవాల్లో ప్రతిసారి పది వేలకుపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 27, 28 తేదీల్లో జిల్లాకేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో 29 రకాల ఈవెంట్స్‌లను సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, స్పెల్ బీ, స్వచ్ఛ తెలుగు, డ్రాయింగ్, నాటికలు, ఇతర ఈవెంట్లు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

మొక్కజొన్నలో నాణ్యమైనవి విత్తుకోవాలి

బిజినేపల్లి: యాసంగి ప్రారంభం కావడంతో రైతులు ఆరుతడి పంటగా మొక్కజొన్న పంటను విత్తుకోవాలని, అందులో నాణ్యమై విత్తనాలను ఎంపిక చేసుకోవాలని పాలెం కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పాలెం కేవీకేలో డీహెచ్‌ఎం–117 రకానికి చెందిన మొక్కజొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌లో మొక్కజొన్నకు మంచి గిట్టుబాటు ధర ఉందని, నీటి మీద ఆధార పంట కాకుండా ఆరుతడి పంటగా మొక్కజొన్న విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శైలజ, డా.సమత పరమేశ్వరి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

మన్ననూర్: లింగమయ్య కాలనీలోని మైనర్ అబ్బాయికి వికారాబాద్‌కు చెందిన 19 ఏళ్ల అమ్మాయితో వివాహం చేసేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో నేషనల్ చైల్డ్ కమిషన్ ఢిల్లీకి చెందిన ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారంతో కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మన్ననూర్ గ్రామానికి వచ్చారు. మైనర్ తీరని అబ్బాయికి పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, అందుకు సంబంధించిన విధి విధానాలు అబ్బాయి తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం అబ్బాయిని వారి వెంట తీసుకొని నాగర్‌కర్నూల్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) వారికి అప్పగించినట్లు సంబంధిత అధికారి తెలిపారు. అమ్మాయి మేజర్ కావడంతో తమతో ఉంచుకోలేదని కమిటీ సభ్యులు తెలిపారు. గత రెండేళ్లుగా అమ్మాయి, అబ్బాయి ఇద్దరు కలిసి ఉంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో అబ్బాయి మేజర్ కావడానికి మరో 3 ఏళ్లు ఆగాల్సిందేనని తెలిపారు. అమ్మాయి తరుపు వారు పెళ్లికి బలవంతం చేయడంతోనే ఈ పెళ్లికి ఒప్పుకున్నట్లు అబ్బాయి తరుపు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ సోషల్ వర్కర్ సృజన, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, గ్రామ కార్యదర్శి భీముడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.



చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల ఆధీనంలో అబ్బాయి